ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 4 అక్టోబరు 2025

- ఏడాది కాలంగా డబ్బు ఖర్చులు
- రిజర్వేషన్ల మార్పుతో అంతర్మథనంలో రాజకీయ నేతలు
- పల్లెల్లో వేడెక్కిన రాజకీయాలు

తారుమారైన ఆశలు..



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్థానిక ఎన్నికల షెడ్యూల్ రావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పల్లెల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎన్నికల కమిషన్ జిల్లాలో రెండు, మూడో ఫేజ్‌లో రెండు విడతల్లోనే గ్రామపంచాయతీ ఎన్నికలను, రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీ ఎన్నికలను పూర్తిచేసే దిశగా సర్వం సిద్ధం చేస్తోంది. రిజర్వేషన్లు కలిసి వచ్చిన ఆశావహులు పల్లెల్లో పోటీకి సిద్ధమవుతూ ఓట్లు రాబట్టుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యవహరించే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉంటే దాదాపు సంవత్సర కాలంగా తమకు అనుకూలంగానే రిజర్వేషన్లు ఉంటాయని పల్లెల్లో పట్టు సాధించే దిశగా ప్రయత్నాలు చేసిన కొందరు ఆశావహులకు నిరాశలు మిగిలాయి.

తమ అనుచరులకు, గ్రామ పెద్దలకు, కుల సంఘాల ఆకట్టుకునే దిశగా డబ్బులు ఖర్చు చేసి రిజర్వేషన్ అనుకూలంగా రాకపోవడంతో ఖంగుతిన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఏ కార్యక్రమం జరిగిన తమ పెద్దరికానికి తగ్గకుండా విరాళాలు ఇచ్చి పరపతి పెంచుకునే ప్రయత్నాలు చేశారు. వినాయక చవితి నుంచి మొదలుకొని గ్రామాల్లో బోనాలు. ఇతర ఉత్సవాలకు భారీగా ఖర్చు చేశారు. సర్పంచ్ పదవులే కాకుండా జడ్పీటీసీ, ఎంపీపీ పదవులు కూడా రిజర్వేషన్లు అనుకూలంగా లేకపోవడంతో దూరం కావలసి రావడంతో నిరాశ చెందారు. రిజర్వేషన్ల తారుమారుతో పండుగ వేళ కూడా బాధతో గడిపారు. కొంతమంది ఆశావహులకు కొద్దిగా మార్పుతో రిజర్వేషన్ అనుకూలంగా ఉండడంతో భార్య, కోడలు, కూతుర్లను బరిలో నిలిపే ప్రయత్నంలో ఉన్నారు. జిల్లాలోని 260 గ్రామసర్పంచ్‌లు స్థానాలకు 2268 వార్డులు, 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీల ఎన్నికల కోసం అక్టోబరు 9న నోటిఫికేషన్ జారీ చేస్తారు. జిల్లాలోని 260 గ్రామ సర్పంచ్‌ల్లో 140 స్థానాలు జనరల్ కాగా, 120 మహిళలకు కేటాయించారు. వందశాతం ఎస్టీలు ఉన్న 26 పంచాయతీలు వారికే రిజర్వు చేశారు ఇతర సర్పంచ్ స్థానాల్లో 76 జనరల్ స్థానాల్లో మహిళలకు 35 కాగా, 41 జనరల్‌కు కేటాయించారు. 26 గిరిజనులకు రిజర్వ్ చేయగా ఆ స్థానాల్లో 12 మహిళలకు, 14 జనరల్ ఉన్నాయి. మరో4 రిజర్వ్ స్థానాల్లో 2 మహిళలకు, 2 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు 53 కేటాయించగా 31 జనరల్, 31 మహిళలకు ఉన్నాయి. బీసీలకు 55 కేటాయించగా మహిళలకు 29, జనరల్‌కు 55 ఉన్నాయి. 2268 వార్డుల్లో మహిళలకు 966 వార్డులు, 1302 జనరల్ వార్డులు ఉన్నాయి. వంద శాతం ఎస్టీలు ఉన్న 176 వార్డులు వారికే రిజర్వు చేశారు. ఇందులో 88 మహిళలు, 88 జనరల్‌కు కేటాయిం చారు. ఇతర ఎస్టీ వార్డులు 53 ఉండగా 20 హహిళలకు, 33 జనరల్, ఎస్సీలకు 443 కేటాయించగా 261 జనరల్, 182 మహిళలకు ఉన్నాయి. బీసీలకు 908 కేటాయంచగా మహిళలకు 388, జనరల్‌కు 520 ఉన్నాయి. జనరల్ వార్డులు 688 ఉండగా మహిళలకు 287, జనరల్ 401 వార్డులు కేటాయించారు. జడ్పీటీసీల స్థానాలు 12ఉండగా ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు మూడు కేటాయించగా ఒకటి మహిళ, రెండు జనరల్ ఉన్నాయి. బీసీలకు ఐదు..

- మిగతా 8లో..

కన్నుల పండువగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం కన్నుల పండువగా స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తుల గోవింద నామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ మారుతిరావు, అర్చకులు మాడంరాజు, కృష్ణమాచార్యులు, మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు, నాయకులు గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు, భక్తులు, దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి ఊరేగింపు..

కోనరావుపేట అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చెన్నకేశవ స్వామిని రథంపై ఊరేగించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని చెన్నకేశవ స్వామిని ఊరేగించగా, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మంగళగిరి లక్ష్మణ్ వేణు చక్రపాణి కిష్టయ్య, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

వేములవాడ క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గుడిసె సదానందంను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం వేములవాడ కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో సదానందంతో పాటు సబ్‌కోర్టు అడిషనల్ పీపీగా నియామకమైన అవదూత రజనీకాంత్‌ను సత్కరించారు. అనంతరం వేములవాడ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌ను కార్యవర్గసభ్యులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ బానుకృష్ణ, ఉపాధ్యక్షులు కటుకం జనార్ధన్, జాయింట్ సెక్రెటరీ సంపత్‌గౌడ్, క్రీడల కార్యదర్శి గుజ్జె మనోహర్, సీనియర్ కార్యవర్గ సభ్యులు టి. అన్నపూర్ణ, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, పొత్తూరి అనిల్‌కుమార్, వేముల సుధాకర్, పెంట రాజు, పర్లపల్లి అంజయ్య, హరికృష్ణ, నవీన్, గంగరాజు, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది..



పదిరలో పార్టీ జెండా గద్దెలకు వేసిన ముసుగులు

ఎలారెడ్డిపేట, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు పదిర, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ తదితర గ్రామాల్లోని వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండా గద్దెలకు ముసుగు వేశారు. గద్దెలు కనిపించకుండా చీరలు, కవర్లతో కప్పేశారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుపరుస్తామని అధికారులు పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బిక్షపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారులో కాస్త జాప్యం జరిగిందన్నారు. ఖరారైన రిజర్వేషన్లను అన్ని పార్టీలు తమ జనాభా ప్రకారం మాకు సీట్లను కేటాయించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదిగా సామాజికవర్గానికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఎంపికలో మాదిగా సామాజిక వర్గానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. జడ్పీటీసీ ఎన్నికలలో మాదిగల జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్ జిల్లాలో రెండు జడ్పీటీసీ బీ ఫాంలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆవునూరి ప్రభాకర్, జిల్లా నాయకులు ఆవునూరి లచ్చన్న, శ్రావణపెల్లి బాలయ్య, కర్రె శంకరయ్య, మునిగె శంకర్, అక్కనపల్లి పోచమల్లు, బొనిగాని కృష్ణ, గజ్జల శశికుమార్, బంటు వంశీకుమార్, మారవేణి దేవరాజు, గంద్రెడ్డి రాజు, శ్రావణపెల్లి రాకేష్, కడకంట్ల రాజయ్య పాల్గొన్నారు.

పంచశీల విజ్ఞాన కేంద్రం ప్రారంభం

గంభీరావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దోసలగూడెం కాలనీలో మాజీ వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు, నాయకులు దోశల ఉపేంద్ర, టేకుమల్ల బాలయ్య, బిట్ల శివప్రసాద్, తోడెటి సుదర్శన్‌ల ఆధ్వర్యంలో పంచశీల విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బామ్‌సెఫ్ జోనల్ ఇన్‌చార్జీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామచంద్రం, ఎంఈవో గంగారాం, ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్, మాలల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఊరూరా దసరా జోష్

- భక్తిశ్రద్ధలతో శమీ, ఆయుధ పూజలు
- సిరిసిల్ల మానేరు తీరంలో రాంలీల
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు





సిరిసిల్ల మానేరు తీరంలో రావణ వధ, అశ్వ వాహనంపై స్వామివారి శమీదర్శనం



రాంలీలను తిలకిస్తున్న ఎస్పీ మహేష్ బీ గీతే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

దసరా సరదాలను నింపింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రులు ఘనంగా జరుపుకున్నారు. విందు, వినోదాలతో గడిపారు. గురువారం ప్రతి ఇంటా దసరా సందడి కనిపించింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో దసరా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ పల్లెల్లో పండుగ సంబురాలతో ఆనందాలు వెల్లివిరిశాయి. ఏ ఇంటిలో చూసినా దసరా హడావిడి కనిపించింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరి పండుగ జోష్ జరుపుకున్నారు. బతుకమ్మతో పాటు దసరాలను జిల్లాలో అతిపెద్ద పండుగగా పరిగణిస్తారు. దసరా వేళ విజయానికి సంకేతంగా రావణ వధ ఘట్టాలు నిర్వహించారు. అక్టోబరు 2 గాంధీ జయంతి అయినా మందు, మాంసంతో విందులు ఘనంగా జరుపుకున్నారు.

రావణ వధ వేడుకలు

చెడుపై విజయంగా భావిస్తూ జిల్లాలో రావణ వధ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల మానేరు తీరంలో జమ్మిగద్దె వద్ద మొదట లక్ష్మీనర్సింహస్వామి అశ్వవాహనంపై ఊరేగింపుగా వచ్చి శమీదర్శనం చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జమ్మి చెట్టుతో శోభాయాత్ర నిర్వహించారు. శమీదర్శనం, రాంలీల వేడుకలకు వేలాది మంది తరలివచ్చారు. ఎస్పీ మహేష్ బీ గీతే పాల్గొన్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు చేపూరి శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్ అడెపు రవీందర్ శ్రీరాముడి వేషధారణతో రావణ వధ వేడుకలను ప్రారంభించారు. జన సందోహం మధ్య రావన దహనం జరిగింది. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విజయ దశమి ప్రజలందరికి సుఖసంతోషాలు కలిగించాలన్నారు. ఉత్సవ సమితి చైర్మన్ చేపూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రావణ వధ కార్యక్రమాన్ని ప్రతియేటా విజయవంతంగా నిర్వహించడానికి సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శమీ, ఆయుధ పూజలు

విజయదశమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శమీ పూజలు, ఆయుధ పూజలు జరిపారు. జిల్లా కేంద్రంలోని వివిధ సంస్థలు, ప్రైవేటు కార్యాలయాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, ఆయుధ పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు మామిడాకులు, బంతిపూల దండలు కట్టారు. గుమ్మడి కాయలు కొట్టారు. జిల్లాలోని పవర్‌లూం కార్ఖానాలు, వివిధ ఫ్యాక్టరీలలో పూజా కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఇళ్లలోకి వెళ్లి దసరా శుభాకాంక్షలను తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వాహనాలకు పూజలు చేశారు. దసరా రోజు ఊరు శివార్లలో పల్లెల్లో పాలపిట్టను దర్శించుకున్నారు. పాలపిట్ట కనబడితే సంవత్సరం పొడవునా విజయాలు కలుగుతాయని శుభసూచకంగా భావిస్తారు. పాలపిట్టను చూడడానికి తహతహలాడారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

అశ్వయుజ శుద్ధ దశమిని విజయానికి సంకేతంగా అమ్మవారిని ఆరాధించుకుంటూ తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన శరన్నవరాత్రి ఉత్సవాలు దసరా రోజు పూర్ణాహుతితో నిర్వహించారు. గురువారం రాత్రి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అమ్మవారి శోభాయాత్ర నిర్వహించి ప్రజలకు దర్శనం కల్పించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు.

పలువురికి ఆర్థిక సాయం అందజేత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయ దసమి పండుగ నేపథ్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి శుక్రవారం చేరుకున్నారు. గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న మోహన్‌రెడ్డి, అంజయ్యలను పరామర్శించారు. మోహన్‌రెడ్డికి ఆర్థిక సాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అభివృద్ధికి రూ.50 వేల తక్షణ సహాయం కింద అందజేయడంతో పాటు రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై స్థానిక నాయకులతో చర్చించారు. సమన్వయంతో పని చేసి అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పాటు పడాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏజీపీ కృష్ణ, రేవంత్‌రెడ్డి మిత్ర మండలి అధ్యక్షుడు విజయ్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రాజేందర్, మల్లేశం, శ్రీనివాస్, శంకర్, రవీందర్, దేవానందం, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో బీజేపీ నాయకులు, గౌడ సంఘం సభ్యులు శుక్రవారం విన్నవించారు. ఆలయ మహిమను వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంజయ్‌కుమార్ నిధుల కేటాయింపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని నాయకులు, సభ్యులు పేర్కొన్నారు. లక్ష్మారెడ్డి, బాలకృష్ణ, కార్తీక్, లింగాగౌడ్, దేవయ్య, కిషన్, సత్తయ్య, అంజయ్య, తిరుపతి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

నిబంధనలు గాలికి..

- జిల్లాలో దసరాకు రూ.5.09కోట్ల మద్యం అమ్మకాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు వైన్స్‌లు నిబంధనలు పాటించడంలేదు. 2023-25 ఎక్సైజ్ పాలసీ ప్రకారం జిల్లాలోని 48వైన్స్‌లు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15, వేములవాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11వైన్స్‌లు ఉన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ విధించిన నిబంధనలు అతిక్రమిస్తున్నారు. నిబంధనలన్నీ తుంగలో తొక్కేస్తున్నారు. ఆదాయమే లక్ష్యంగా నిబంధనలు గాలికి వదిలేశారు. ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే మద్యం వ్యాపారం జోరుగా సాగుతోందనే విమర్శలున్నాయి. ఈ విధంగా జిల్లాలో 20నెలల్లో దాదాపు రూ.961కోట్ల మద్యం విక్రయించారు. దసరా సందర్భంగా రెండు రోజుల్లో రూ. 5.09కోట్ల మద్యం తాగేశారు. మళ్లీ వైన్ షాపులను కైవసం చేసుకునేందుకు జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు 48దరఖాస్తులు సమర్పించారు. ఈనెల 18న దరఖాస్తుల ప్రక్రియ ముగియనుంది.

వైన్స్‌ల ఏర్పాటుపై అభ్యంతరాలు..

జిల్లాలోని జిల్లెల్లలో ప్రస్తుతం కొనసాగుతున్న వైన్స్ ఏర్పాటుపై కిరికిరి నెలకొంది. జనవాసాల మధ్య ఉన్న వైన్స్‌లు తొలగించాలని పలుమార్లు ఎక్సైజ్ అధికారులను ప్రజలు కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. జిల్లెల్లో వైన్స్ ప్రారంభం నుంచే ప్రజలు నిరసన వ్యక్తం చేయడంతో కిరికిరి మొదలైంది. మరోవైపు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో వైన్స్‌లను ప్రారంభించవద్దని ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ విధంగా 2023-25 ఎక్సైజ్ పాలసీలో జిల్లాలో పలుచోట్ల వైన్స్‌ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించగా, ఈసారి అదే పరిస్థితి తలెత్తనుంది.

నిబంధనలకు తిలోదకాలు..

జిల్లాలో వైన్స్‌ల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ విధించిన నిబంధనలను హుష్ కాకీ అయ్యాయి. వైన్స్‌ల ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు ఉండకూడదు. ఇవేకాకుండా దేవాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, చర్చీలు, 30పడకల ప్రభుత్వ ఆసుపత్రులకు కనీసం 100మీటర్ల దూరంలో వైన్స్‌లు నెలకొల్పాలి. ప్రతి వైన్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పరిచి క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలి. మైనర్‌లకు మద్యం విక్రయించకూడదు. వైన్స్ వద్ద బోర్డు ఏర్పరచాలి. నేషనల్ హైవే, స్టేట్ హైవేలకు కనీసం 220మీటర్ల దూరంలో వైన్స్‌లు ఉండాలి. వైన్స్‌ల సమయ పాలన పాటించాలి. సీసీ కెమెరాలు బిగించాలి. సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయవు. ప్రతి రోజు ఉదయం 10గంటల నుండి రాత్రి 10గంటల వరకే మద్యం విక్రయించాలి. ఈ నిబంధనలన్నీ గాలికే వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నిబంధనలన్నింటిపై ఎక్సైజ్, పోలీసు శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



జిల్లాలోని ఓ వైన్‌షాపు వద్ద బారులు తీరిన మద్యంప్రియులు..

బార్‌కోడింగ్ జాడే లేదు..

జిల్లాలోని వైన్స్‌లలో మద్యం విక్రయాల్లో బార్‌కోడింగ్ జాడే లేదు. ప్రతి వైన్స్ వద్ద ఎంఆర్‌పీ ధరల పట్టికను ప్రదర్శనగా పెట్టాలి. ప్రతి బ్రాండ్ లేబుల్‌ను బార్‌కోడింగ్‌కు అనుసంధానం చేయాలి. ఏ వైన్స్‌లోనూ బార్ కోడింగ్ మిషన్‌లు కనిపించవు. కొన్ని వైన్స్‌లలో బార్‌కోడింగ్ మిషన్‌లు తెప్పించినా ఉపయోగించడంలేదు. వైన్స్‌లలో ఎవరూ మద్యం కొనుగోలు చేసినా బార్‌కోడింగ్ చేసి బిల్లులు ఇవ్వాలి. ఏ వైన్స్‌లోనూ బార్ కోడింగ్ విధానంలో మద్యం విక్రయించడంలేదు. బార్ కోడింగ్ లేకపోవడంతో మద్యం ధరలు ఎంఆర్‌పీ కంటే ఎక్కువైనా తక్కువైనా అమ్మే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ప్రతి వైన్స్‌లోనూ బార్ కోడింగ్ విధానం అమలు చేయాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

యథేచ్ఛగా పర్మిట్ రూమ్‌లు..

వైన్స్‌లకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకునే వెసులుబాటును ఎక్సైజ్ శాఖ కల్పించింది. ఈసారి ఎలాంటి ఫీజు లేకుండానే పర్మిట్ రూమ్ ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. గతంలో ప్రతి వైన్స్‌కు రూ. 2లక్షలు చెల్లించాల్సి ఉండేది. ఈసారి లైసెన్స్ ఫీజు పెంచడమే కాకుండా ప్రత్యేక ఎక్సైజ్ టాక్స్ పేరిట రూ.5లక్షలు వసూలు చేయడంతో పర్మిట్ రూం ఫీజు తీసుకోలేదు. అయినప్పటికీ పర్మిట్‌రూమ్ ఏర్పాటుపై ఎక్సైజ్ శాఖ ఏమి చెప్పలేదు. అయితే పర్మిట్ రూమ్‌లలో మద్యం తాగాలి. వైన్స్ ఎదుటే నిలబడి, పక్కన నిలబడి మద్యం తాగడం సాధారణమైంది. కేవలం 100చదరపు అడుగులే పర్మిట్ రూం ఉండాలి. కొన్ని పర్మిట్ రూమ్‌లు బార్‌లను తలపిస్తున్నాయి. పర్మిట్ రూమ్‌లలో కిచెన్ ఏర్పాటు చేసి అన్ని రకాల వంటలు చేసి ఇచ్చేస్తున్నారు.

బెల్ట్‌షాప్‌లలో జోరుగా విక్రయాలు..

జిల్లాలో బెల్ట్‌షాప్‌లలో మద్యం విక్రయాలు ఆగడంలేదు. జిల్లాలోని ప్రతి వైన్స్ నుంచి బెల్ట్ షాప్‌నకు మద్యం తరలివెళుతోంది. ఈసారి దసరా గాంధీ జయంతి రోజున కావడంతో ముందస్తుగానే బెల్ట్‌షాప్‌లకు మద్యం తరలించారు. దీంతో దాదాపు 250కి పైగా బెల్ట్‌షాప్‌లు నెలకొల్పి బహిరంగంగానే మద్యం విక్రయించారు. కేవలం ఎన్నికల సమయంలో బెల్ట్‌షాప్ నిర్వాహకులను బైండోవర్ చేసి వదిలేస్తున్నారు. బెల్ట్‌షాప్‌లన్నీ ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని బెల్ట్‌షాప్‌లలో ధరలు పెంచి మద్యం విక్రయించడం మామూలైపోయిందనే విమర్శలున్నాయి.

వేములవాడలో ఘనంగా దసరా వేడుకలు

- అంబారి సేవపై స్వామివారి ఊరేగింపు



అంబారి సేవపై ఊరేగుతున్న స్వామివారలు

7

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన అధికారులు, నాయకులు



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు

8

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



శిరీష(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన పోతరవేణి శిరీష(29) కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. మందులు వాడినా నొప్పి తగ్గకపోవడంతో బుధవారం ఇంటిలో పురుగుల మందు తాగింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్త సంపత్‌తోపాటు కూతురు సాన్విక ఉన్నారు. తండ్రి ఈరవేని రాజమల్లు ఫిర్యాదుమేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని యువకుడు బలవన్మరణం

మానకొండూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన రాచూరి అజయ్‌కుమార్(35) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా అజయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుత్రులలో చికిత్స పొందిన వ్యాధినయం కాలేదు. దీనికి తోడు అతని భార్య నాలుగేళ్లుగా కాపురానికి రావడం లేదు. దీంతో తీవ్రంగా మనస్థాపానికి గురైన అజయ్‌కుమార్ ఇంటిలోని దూలానికి చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం వెంటనే అతన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య



గంగోత్రి(ఫైల్)

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్దండి గ్రామానికి చెందిన అల్లెపు గంగోత్రి(22) అనేయువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అనిల్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఎర్దండి గ్రామానికిచెందిన బోదాసుఅలియాస్ అల్లెపు గంగోత్రి అదేగ్రామానికి చెందిన సంతోష్ ప్రేమించుకుని ఇటీవల పెద్దలసమక్షంలో వివాహం చేసుకున్నారు. కాగా దసరాపండుగను పురస్కరించుకుని గురువారం గంగోత్రి, సంతోష్ గంగోత్రి వాళ్ల అమ్మవారి ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం చేస్తున్న క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం వారు వాళ్ల ఇంటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గంగోత్రి రాత్రిసమయంలో దూలానికి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలితల్లి బోదాసు శారద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం: కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని పుట్టింటికి వచ్చిన తల్లీకూతుళ్లు సుమలత, నిషితలు అదృశ్యంపై కేసు నమోదుచేశామని ఎస్ఐ రాహూల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. గ్రామంలోని లక్ష్మీ-రాజు దంపతుల కూతురు సుమలతకు 2020 లో జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన అలకుంట రాజుతో వివాహమైందని తెలిపారు. గతనెల27న లక్ష్మీ తన కూతురు సుమలత, మనుమరాలు నిషితలను చింతకుంట నుంచి రాచర్లగొల్లపల్లికి తీసుకు వచ్చిందని చెప్పారు. అదేనెల 28న సుమలత తన కూతురు నిషితను తీసుకుని ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయిందని పేర్కొన్నారు. కూతురు, మనుమరాలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు లక్ష్మీ, రాజు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లవద్ద ఆరాతీశారని తెలిపారు. ఆచూకీ లభించకపోవడం వల్ల రాజు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహూల్‌రెడ్డి వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌ను దూషించాడని ఓ వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికుమార్ శుక్రవారంతెలిపారు. ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా కానిస్టేబుల్ పల్లం అశోక్ బందోబస్తు నిర్వహిస్తున్నాడు. అదేగ్రామానికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్ గురువారం సాయత్రం బైక్‌పై తిరుగుతూ కానిస్టేబుల్ వద్దకు వచ్చి బండిఆపి దూషించడంతో పాటు భుజంపై చేయివేసి నెట్టివేశాడు. విధులకు ఆటంకం కలిగించి ఇబ్బందులకు గురిచేసిన రేణికుంట్ల ప్రవీణ్‌పై కానిస్టేబుల్ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

అధ్వానస్థితిలో అంతర్గత రోడ్డు..

- ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం



కందికట్కూర్‌లో చెడిపోయిన రోడ్డు

ఇల్లంతకుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానస్థితికి చేరుకున్నాయి. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకవచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందికట్కూర్ గ్రామంలో రోడ్లు పూర్తిగా గుంతలమయం అయ్యాయి. వంతడుపుల గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగువానిపల్లెకు వెళ్లే రోడ్డు, నారెడ్డిపల్లెకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకవచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో నారెడ్డిపల్లె గ్రామస్థులు రాస్తారోకో చేపట్టారు. సమస్యను తెలుసుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అప్పటి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలు రోడ్డును పరిశీలించి త్వరలోనే మరమ్మతులు చేస్తామని, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాళ్లపల్లి సమీపంలోని రోడ్డును ద్విచక్రవాహనంపై వెళ్లి పరిశీలించి వచ్చారు. అయినా కూడా ఇప్పటివరకు కనీసం గుంతలలో మట్టిని కూడా పోయలేదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. గ్రామాలకు పాలను తీసుకొని వెళ్లే వాహనాలు కూడా రావడానికి ఇబ్బంది పడుతున్నారని రెండు రోజులు వాహనాలు కూడా రాలేదని, దీనితో పాలరైతులు నష్టపోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రాస్తారోకో చేస్తున్న నారెడ్డిపల్లె గ్రామస్థులు (ఫైల్)

సమస్య పరిష్కారం కాలేదు



పినకాసి మనోహర్, తెనుగువానిపల్లె

తెనుగువానిపల్లెకు వచ్చే రోడ్డు పూర్తిగా గుంతలమయం అయింది. వాహనాలు నడవడానికి ఏమాత్రం అనుకూలంగా లేదు. గుంతలుపడిన రోడ్డుపై వాహనాలు వెళుతుండటం వల్ల తరచూ రిపేర్‌కు వస్తున్నాయి. సమస్యను అనేకసార్లు అధికారులకు దృష్టికి తీసుకవచ్చినా రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు. పల్లెల రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ద్విచక్రవాహనాలపై మాత్రమే ప్రయాణిస్తున్నాం.

రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించాలి...



కాంతాల సాయికృష్ణ, నారెడ్డిపల్లె

వంతడుపుల గ్రామపంచాయతీ పరిధిలోని నారెడ్డిపల్లెకు వచ్చే రెండురోడ్లు పూర్తిగా చెడిపోయాయి. రోడ్ల మరమ్మతులపై అధికారులు దృష్టిసారించాలి. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు రాస్తారోకో సైతం చేపట్టారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తామని అధికారులు హామీఇచ్చారు. కేవలం బతుకమ్మ పండుగ సందర్భంగా ఇళ్లు ఉన్న ప్రాంతంలో మాత్రమే కొద్దిగా మట్టిపోశారు. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల సమస్య తీరడం లేదు. అధికారులు వెంటనే పనులు చేపట్టాలి.

అనారోగ్యంతో పోలీసు జాగిలం మృతి



నివాళులర్పిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించిన జాగిలం డానీ గురువారం అర్ధరాత్రి అనారోగ్యంతో మరణించింది. డానీ మృతితో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం నివాళులు అర్పించారు. డొబెర్మెన్ పిన్‌శ్చర్ జాతికి చెందిన డానీ 2015 బ్యాచ్‌కు చెందినది. ట్రాకర్ జాగిలంగా ప్రత్యేక శిక్షణ పొందింది. పదేళ్లుగా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల పరిష్కారంలో కీలక పాత్ర పోషించింది. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు కానిస్టేబుల్ మురళి డానీకి హ్యాండ్లర్‌గా వ్యవహరించారు. అడిషనల్ డీసీపీ భీంరావు, రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్ జానిమియా, డాగ్‌హ్యాండ్లర్‌లు మురళి, రాజు, శంకర్, మహేందర్, కపిల్, రాజిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

రాజిరెడ్డి జనజీవన స్రవంతిలో కలవాలి



బట్టలు, బియ్యం అందజేసిన ఏసీపీ కృష్ణ

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ఉద్యమంలో ఉండి సాధించేది ఏమీ లేదని, మావోయిస్టు నేత కంకణాల రాజిరెడ్డి జనజీవన స్రవంతిలో కలవాలని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని మావోయిస్టు నేత కంకణాల రాజిరెడ్డి తల్లి వీరమ్మను కలిసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న ఊరు, తోబుట్టువులు, తల్లితండ్రులను విడిచి అడవిలో ఉండి సాధించేదేమీ లేదన్నారు. ఇప్పటికైనా రాజిరెడ్డి లొంగిపోయి వృద్ధాప్యంలో ఉన్న తల్లి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రివార్డుతోపాటు ఉపాధి కల్పిస్తామన్నారు. అనంతరం వీరమ్మకు దసరా పండుగ సందర్భంగా దుస్తులు, పండ్లు, బియ్యం అందించారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

ఎన్టీపీసీలో ఐదు కిలోల గంజాయి పట్టివేత

ఎన్‌టిపిసి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీ పవర్‌హౌస్ సమీపంలో గురువారం పోలీసులు గంజాయి పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో ఎన్టీపీసీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న సాయి, లంక సాయి, చేద శ్రీనివాస్‌లను తనిఖీ చేయగా వారివద్ద బ్యాగులో తరలిస్తున్న ఐదు కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.1.25 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం వారిని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు

- కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పట్టించుకోవడం లేదని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందామనుకున్న వృద్ధురాలికి గోదావరిఖని పోలీసులు భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. వృద్ధాప్యంలో అండగా ఉండాలంటూ సూచించారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఒక వృద్ధురాలు పిల్లలు పట్టించకోకపోవడంతో వారికి భారంగా ఉండలేనని ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. శుక్రవారం ఆటో ఎక్కి గోదావరి వంతెన వద్దకు తీసుకెళ్లాలంటూ సూచించింది. వాకబు చేసిన డ్రైవర్‌కు తాను గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపింది. ఆటో డ్రైవర్ నేరుగా ఆటోను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న సీఐ ఇంద్రసేనారెడ్డి వృద్ధురాలిని పిలిచి మాట్లాడి చావు పరిష్కారం కాదని భరోసా ఇచ్చారు. ఒక మాజీ ప్రజా ప్రతినిధి ద్వారా వృద్ధురాలి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధురాలిని ఇంటికి పంపారు. ఎస్ఐ అనూష, సిబ్బంది ఉన్నారు.

మేకలు మేపుతున్న మహిళపై దాడి

- మెడలో బంగారు గొలుసు చోరీ
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రోదిస్తున్న సరోజన

సైదాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం శివారులోని మోడల్‌స్కూల్ సమీపంలో శుక్రవారం రోడ్డుపక్కన ఓ మహిళ మేకలు మేపుతుండగా ఓవ్యక్తి ఆ మహిళపై దాడిచేశాడు. ఆమె మెడలోని బంగారు గొలుసును దొంగిలించాడు. స్థానికులు, పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. లస్మన్నపల్లి గ్రామానికి చెందిన రేగుల సరోజన సోమారం శివారులో సైదాపూర్-ములంగూర్ రోడ్డుపక్కన మోడల్‌స్కూల్ సమీపంలో మేకలు మేపుతోంది. మధ్యాహ్నం వేళ బైకుపై ఒకవ్యక్తి వచ్చి ఆమెపై దాడిచేసి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని బైకుపై ములంగూర్ వైపు వెళ్లాడు. మహిళా లబోదిబోమని మొత్తుకోగా స్థానికులు వెళ్లేసరికి ఆదొంగ పారిపోయాడు. స్థానికులు వెంటనే 100కు ఫోన్‌చేయగా ఎస్సై తిరుపతి తనసిబ్బందితో సంఘటనస్థలానికి చేరుకొని పరిశీలించారు. దొంగను పట్టుకునేందుకు పోలీలు దర్యాప్తు చేస్తున్నారు.

ఓసీపీ-3లో షావల్ బోల్తా

- ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో గురువారం షావల్ బోల్తా పడి ఆపరేటర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సెకండ్‌షిఫ్టులో క్వారీలో ప్రగతి షావల్ అకస్మాత్తుగా బోల్తా పడడంతో ఈపీ ఆపరేటర్ లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. తల, వెన్నుముక భాగాలకు గాయాలు కావడంతో అధికారులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైనచికిత్స నిమిత్తం లక్ష్మీనారాయణను హైద్రాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. క్వారీలో ఫైర్‌కోల్ కారణంగా పొగకమ్ముకుని పనిప్రదేశాలు ఆపరేటర్లకు స్పష్టంగా కనిపించకపోవడం, పని ప్రదేశం ఇరుకుగా ఉండడంతో లైటింగ్ తక్కువగా ఉండడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. సీఐటీయూ బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ హైద్రాబాద్ ఆసుపత్రిలో లక్ష్మీనారాయణను పరామర్శించా రు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు ఫోన్లను అప్పగిస్తున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలల కిందట కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో బెజ్జంకి జాన్సన్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీసు లకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ టెక్నాలజీతో హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఫోన్‌ను జాన్సన్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి అప్పగించారు. ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేను సీఐ అభినందించారు.

తిమ్మాపూర్ : ఆరునెలల క్రితం తిమ్మాపూర్ మండలానికి చెందిన సిగుళ్ల రాజయ్య, రొండ్ల వినోద్ ఫోన్‌లను పోగొట్టుకోగా ఎల్ఎండీ ఎస్సై శ్రీక్రాంత్‌గౌడ్ రికవరీ చేసి శుక్రవారం వారికి అప్పగించారు. పోగొట్టుకున్న ఫోన్‌లను సీఐఈఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి



వెంకటేష్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్దండి గ్రామానికి చెందిన వాకమల్ల వెంకటేష్ (33) అనేవ్యక్తి చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వెంకటేష్ కొంతకాలంగా ఎర్దండిలో స్థిరపడి తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల30న మద్యం తాగి ఇంటికి వచ్చిన వెంకటేష్ తనభార్యని డబ్బులు అడిగాడు. ఆమెలేవని చెప్పడంతో కోపంతో నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేసినా స్విచ్‌ఆఫ్ వచ్చిందని మృతుడిభార్య పేర్కొంది. ఈక్రమంలో శుక్రవారం గ్రామశివారులోని చెరువులో మృతదేహం ఉందని గ్రామస్థులు తెలపడంతో వెళ్లిచూడగా అది వెంకటేష్‌దేనని నిర్ధారణ అయింది. మృతుడిభార్య వాకమల్ల రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసాదేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- భారీగా వాహనాల రద్దీ
- ఆలయకమిటీకి భారమవుతున్న ఆలయ నిర్వహణ
- ప్రభుత్వం మానసాదేవి ఆలయంపై దృష్టిపెట్టాలని భక్తుల విజ్ఞప్తి



మానసాదేవి ఆలయం నుంచి వడ్లూరుకు వెళ్లే దారిలో భక్తుల వాహనాల రదీ

గన్నేరువరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేటలో మానసాదేవి అమ్మవారి ఆలయానికి రోజురోజుకీ భక్తుల తాకిడి పెరుగుతోంది. దీంతో ఈ దారిలో వాహనాల రద్దీపెరగడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం నుంచి గన్నేరువరానికి వెళ్లేదారితోపాటు వడ్లూరుకు వెళ్లేదారిలో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సుతోపాటు ద్విచక్రవాహనదారులు సైతం గంటలతరబడి ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో భక్తులు వేల సంఖ్యల్లో, మిగతా రోజుల్లో వందలసంఖ్యల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దీంతో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి, ఆలయ నిర్వహణ బాధ్యత ఆలయ కమిటీకిభారంగా మారుతోంది. ఆలయపరిసరాల్లో వాహనాల పార్కింగ్ కష్టంగా మారడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. బస్సుల కోసం వేచిచూసే భక్తులు ఎండకు, వానకు రోడ్లపైన వేచిఉంటున్నారు. భక్తులకు సరిపడా సౌకర్యాలను అందించేందుకు ఆలయకమిటీకి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందిగా మారడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. ఆలయ నిర్వహణ బాధ్యతను ఎండోమెంట్‌కు అప్పగిస్తే ఆలయం మరింత అభివృద్ధి చెంది పలువురికి ఉపాధి సైతం అందుతుందని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



అరవింద్(ఫైల్)



రాజ్‌మహ్మద్(ఫైల్)

సుల్తానాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, జూలపల్లి మండలాల్లో.. రాజన్నసిరిసిల్ల ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులో జరిగిన వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందారు. దసరా పండుగ వేళ ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద దసరా రోజున జరిగిన రోడ్డు ప్రమాదంలో అరవింద్(22) మృతి చెందాడు. దసరా పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు సంతోషంగా పండుగ జరుపుకుంటున్న తరుణంలో అరవింద్ ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్‌తో బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో కాట్నపల్లి వద్ద చెట్టును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కిందపడిన అరవింద్‌పై ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎస్ఐ శ్రావణ్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదవివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందినవాడని, హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడని దసరా సెలవులకు ఇంటికి రావడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలంలోని చీమలపేట గ్రామానికి చెందిన నేవూరి కుమారస్వామి(23)అనే యువకుడు ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొని మృతిచెందాడు. గ్రామానికి చెందిన కుమారస్వామి చీమలపేటలోగల పెట్రోల్‌బంకులో పని చేస్తున్నాడు. రోజులాగే ఉదయం ఆరుగంటలకు పెట్రోల్ బంకుకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. దసరా పండుగ సందర్భంగా స్నేహితులను కలిసేందుకు వెళ్లి ఆరుగంటలకు ఇంటికి చేరుకున్నాడు. అనంతరం పెద్దాపూర్ గ్రామానికి చెందిన స్నేహితుని వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన కుమారస్వామి రాత్రి9 అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కుమారస్వామి స్నేహితుడికి ఫోన్‌చేయగా ఇంటికి బయలు దేరాడని తెలిపాడు. రాత్రి 12అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తెలుకుంట గ్రామానికిచెందిన ఒకరు ఫోన్‌చేసి కుమారస్వామి పెద్దాపూర్,తెలుకుంట గ్రామాల మధ్య రోడ్డుపక్క బైక్‌చెట్టుకుఢీకొని మృతిచెందాడని తెలుపడంతో సంఘటన స్థలానికి కుటుంబసభ్యులు చేరుకున్నారు. కుమారుడి మృతిపై అనుమానాలు లేవని మృతుడి తండ్రి చంద్రమౌళి చేసిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డి పేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన వృద్ధుడు ఎండీ రాజ్‌మహ్మద్(62) మృతిచెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని వృద్ధుడు ఎండీ రాజ్‌మహ్మద్ స్థానిక మజీద్‌లో మోజన్‌గా కొనసాగుతున్నాడు. గురువారం వేకువజామున తన బైక్‌పై రాచర్లతిమ్మాపూర్ నుంచి రాచర్లగొల్లపల్లి వైపుకు వస్తున్న క్రమంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రాజ్‌మహ్మద్ రోడ్డు పక్కన ఎగిరిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మజీద్ కమిటీ సభ్యులు వాహనం కోసం ఆరా తీశారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా వాహనాన్ని గుర్తించి పోలీసులకు విషయం తెలిపారు. వాహన నంబర్‌ను గుర్తించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన అదే గ్రామంలోని కారు డ్రైవర్ బొమ్మనవేణి కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడి భార్య హసంబీ మూడేళ్ల కిందట చనిపోయింది. కొడుకులు బాబా షరీఫ్, షబ్బీర్, అజీజ్, కూతురు జరీనా ఉన్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు శుక్రవారం 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు ఒకగేట్ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.97ఉండగా, సామర్థ్యం27.55 టీఎంసీలకు 27.479 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరదనీరు రావడం శుక్రవారం తగ్గింది. 33గేట్లు పైకి ఎత్తి 1,25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 71.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాణీ ప్రసాద్‌కు గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారం


రాణీప్రసాద్

సిరిసిల్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీ ప్రసాద్‌కు గురువారం గాంధీ ఫెలోషిప్ సంస్థ వారు గాంధీ ఇన్‌స్పిరేషనల్ జాతీయ పురస్కారాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సమర యోధుల వారసురాలు, గాంధీతోకలిసి నడిచిన అంగలకుదిటి సుందరాచార్యులు కుమార్తెగా, కస్తూరిబా గాంధీపిల్లల నవలా రచయిత్రిగా, గాంధీచిత్రాలను రూపొందించిన చిత్రలేఖకురాలిగా డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌ను జాతీయ పురస్కారానికి ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌కు ఈనెల5న హైదరాబాదులో పురస్కారాన్ని అందజేయనున్నారు. స్వాతంత్ర అమృతోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని రాణీప్రసాద్ స్వాతంత్ర్యానికి సంబంధించి 75చిత్రాలను తయారుచేశారు. అందులో స్వాతంత్రోద్యమ కవితలు, స్వాతంత్ర అమరవీరుల చిత్రాలు, జాతీయ పతాకాలు, భారతదేశ చిత్రపటాలను తయారుచేసి రెండు ఎగ్జిబిషన్ నిర్వహించారు. జాతీయపురస్కారాన్ని అందుకోబోతున్న రాణీప్రసాద్‌ను మానేరు రచయితల సంఘం, జిల్లా రయితల సంఘం కవులు, రయితలు అభినందించారు.

ద్విచక్ర వాహనంలో నాగుపాము

హుజూరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్‌చేసిన ద్విచక్రవాహనంలో శుక్రవారం నాగుపాము దర్శనమిచ్చింది. బైక్‌లోని బ్యాగ్ కదులుతుందని చూడడంతో నాగుపాము కనిపించింది. దీంతో ఒరిస్సాకు చెందిన ఓవ్యక్తి బైక్‌బ్యాగ్‌లో నుంచి నాగుపామును బయటకుతీసి సమీపంలో ఉన్న చెట్లలో వదిలిపెట్టాడు. నిత్యంరద్దీగా ఉండే బస్టాండ్‌లో పార్కింగ్ చేసినబైక్‌లోకి నాగుపాము ఎలా వచ్చిందని ప్రజలు ఆశ్చర్య పడుతున్నారు.

ప్రారంభం కాని పనులు

- పూర్తికాని ఏటీఎస్ టెండర్లు
- అరకొర వసతులతో ఫిట్‌నెస్, డ్రైవింగ్ టెస్టులు
- ప్రస్తుతం తనిఖీల్లో కొరవడిన శాస్త్రీయత


డ్రైవింగ్ ట్రాక్ లేక రాళ్ల నడుమ డ్రైవింగ్ టెస్టు (ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 23న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో రవాణాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర, జిల్లా అధికారులు 8కోట్ల రూపాయ లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆరు నెలలు గడిచిన ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ప్రారంభం అయితే రవాణా శాఖ కేంద్రానికి పరీక్షల కోసం వచ్చే వాహనాలను ఆటో మేటెడ్‌గా పరీక్షలు నిర్వహించే వీలు ఉంటుంది. ఈ పరీక్షలు మోటారు వాహన చట్టం 1988 ప్రకారం నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ద్వారా వాహనంలోకి అన్ని లోపాలు బయటపడుతాయి. ఈ పరీక్ష తర్వాత వచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కొన్ని సంవత్సరాల వరకు చెల్లుబాటు ఉంటుంది. వాహనాల సామర్థ్య పరీక్షలకు ఆటోమేటెడ్ యంత్రాలు అందుబాటులోకి వస్తే దీని ద్వారా ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా వాహన కండిషన్‌పై పాస్, ఫెయిల్ సర్టిఫికేట్ అందిస్తుంది, ఆటోమేషన్ ఎక్కువ సామర్థ్యం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తుంది. మానవ తప్పిదాలను నియంత్రిస్తుంది, ఏటీఎస్ అందుబాటులోకి వస్తే వాహన రహదారి భద్రతను నిర్ధారించడంలో ఇది ఒక ప్రధాన పరివర్తనగా భావిస్తున్నారు.


వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్న అధికారులు (ఫైల్)

40 అంశాలపై తనిఖీలు

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించిన 40 అంశాలను ప్రమాణాలను అనుగుణంగా ఈ ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ కేంద్రాలు తనిఖీ చేసి వాహనం సామర్థ్యాన్ని చెబుతుంది. బస్సులు, లారీలు, ఆటోరిక్షాలతో పాటు అన్ని రకాల ప్రయాణికుల రవాణా, సరుకు రవాణా వాహనాలను ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ ఫిట్‌నెస్ కేంద్రాల్లోనే తనిఖీ చేయనున్నారు. తనిఖీ లకు వచ్చే వాహనాల ఇంజన్ సామర్థ్యం, బ్రేకులు, టైర్లు, కాలుష్య కారకాల తీవ్రతతో పాటు సైడ్ మిర్రర్‌లు, షాకబ్జర్వర్స్, బ్యాటరీ, ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలను తదితర 40 అంశాలపై క్షుణంగా నిగ్గు తేలుస్తుంది.

ఆటోమేటెడ్ ఫిట్‌సెస్ టెస్ట్ వల్ల ప్రయోజనాలు

ఆటోమేటెడ్ టెస్టింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తే ముఖ్యంగా సమయం ఆదా అవుతుంది. వీటి వల్ల చేసే పరీక్షలు ఖచ్చితత్వంతో పాటు తక్కువ ఖర్చుతో ఉంటాయి. ఖచ్చితత్వంగా వచ్చే రిజల్ట్ వల్ల రోడ్డు ప్రమాదాలు నియంత్రణలోని వస్తాయి. వీటి వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. మాన్యువల్ తనిఖీలలో ఉండే అవినీతిని తగ్గిస్థాయి, దేశవ్యాప్తంగా ఈ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుంది. ఈ స్టేషన్‌లు ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎఎఫ్‌యంఎస్) ద్వారా పని చేస్తాయి. వాహనదారులు ఆన్‌లైన్‌లో ఫిట్‌నెస్ పరీక్షల కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. పరీక్షల అనంతరం పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్‌లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ఉన్నా ఇంకా అది వినియోగంలోకి రాలేదు. దీంతో అధికారులు డ్రైవింగ్ టెస్టులు కూడా బండరాళ్ల వివిధ రూపాల్లో పెట్టి వాటిలో డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

ఏటీసీని ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేయాలి..

పురుషోత్తం, డీటీసీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా



ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణం కోసం జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో రోడ్డు, భవనాల శాఖ వారికి స్థలం అప్పగించాం. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను వారు నిర్మించి మాకు అప్పగించాల్సి ఉంటుంది. ఆర్ అండ్‌బీ శాఖ వారు ఎప్పుడు నిర్మించి ఇచ్చినా వెంటనే రవాణాశాఖ వాహనాల తనిఖీ చేపడుతుంది.

టెండరు ప్రక్రియలో ఉంది

నర్సింహ చారి, ఈఈ, ఆర్‌అండ్‌బి

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి ఇంకా టెండరు దశలోనే ఉంది. టెక్నికల్‌గా సమస్యలు ఉన్నాయి. వాటి పరిష్కారం తరువాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. ఇంకా ఎంత సమయం పడుతుందో తెలియదు. ఈఎన్‌సి పరిధిలో ఉంది.


చెట్ల కింద డ్రైవింగ్ టెస్ట్ (ఫైల్)

గంటకు 30 వాహనాల తనిఖీ చేసే సామర్థ్యం

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే గంటకు సుమారు 30 వాహనాల వరకు తనిఖీలు నిర్వహించే విధంగా పూర్తి స్థాయిలో కంప్యూటరీకరించే అవకాశం ఉంటుంది, ప్రస్తుతం వాహనాలను మోటారు వాహన తనిఖీ అధికారులే అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో స్వయంగా తనిఖీలు చేసి వాహనాల సామర్థ్యాన్ని ధ్రువీకరిస్తున్నారు. రానున్న రోజుల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ పనులన్నింటినీ యంత్రాలు చేయనున్నాయి. ప్రస్తుతం మోటారు వాహన తనిఖీ అధికారులు నిర్వహించే తనిఖీల్లో శాస్త్రీయత కొరవడినట్లు, మొక్కుబడిగా నిర్వహిస్తు న్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రస్తుతం నిర్వ హించే తనిఖీల వల్ల కాలం చెల్లిన, కండీషన్‌లేని వాహనాలకు తేలిగ్గా అనుమతి లభిస్తుందని ఆరోపణలున్నాయి. కాలం చెల్లిన వాహనాలు, సరైన ఫిట్‌నెస్ లేని వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు, రహదారి భద్రతకు ముప్పు ఏర్పడుతుందనే భావన ఉంది.

కరీంనగర్, సిరిసిల్ల జడ్పీలపై కాషాయ జెండా ఎగురవేస్తాం

- సర్వే ఆధారంగా పార్టీ టికెట్లు
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల జడ్పీలను బీజేపీ కైవసం చేసుకొని కాషాయ జెండా ఎగురవేస్తామని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. స్థానికసంస్థల ఎన్నికలపై రాష్ట్రపార్టీ సర్వే చేపిస్తోందని, సర్వేలు కూడా ఇవే ఫలితాలను చెబుతున్నాయని సంజయ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనే కాంగ్రెస్ పార్టీకి సోయి కూడా లేదని ఆరోపించారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారా అని తాను ఎదురుచూస్తున్నానని, ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల టికెట్ కేటాయింపు విషయాన్ని చూసుకుంటుందని, ఇప్పటికే సర్వే కూడా జరిపిస్తోందని చెప్పారు. సర్వే నివేదికను బట్టే గెలుపే ప్రాతిపదికన టికెట్లు వస్తాయని అన్నారు. టికెట్ రానివారు బాధపడవద్దని, వారికి పార్టీ పదవులు సహా ఇతరత్రా అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పార్టీశ్రేణులకు భరోసా ఇచ్చారు. ప్రతి పల్లెలో ఉపాధిహామీ పనులు, ప్రధాని సడక్‌యోజన, సీఐఆర్ఎఫ్ సహా అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని అన్నారు. మహిళలకు 2500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని కాంగ్రెస్ మాటతప్పిందని, వృద్ధులకు 4వేల పెన్షన్ ఇస్తామని మోసం చేశారని విమర్శించారు. రైతు కూలీలలకు రైతుభరోసా, రైతులకు కూడా ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారు, ఎన్నికల తర్వాత రైతుభరోసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టబోతుందని సంజయ్ ఆరోపించారు. 22నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీలకు ఒక్కపైసైన అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీ బలం, బలగం పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలేనని స్పష్టం చేశారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ కూడా చేయకుండా చేతులెత్తేసిందని సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్‌కు టీచర్ ఎమ్మెల్సీగా పోటీచేసే అభ్యర్థి కూడా దొరకలేదని ఎద్దేవా చేశారు. ఈసారి స్థానిక ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకునే మంచి అవకాశముందని, దీన్ని సద్వినియోగం చేసుకొని పార్టీజెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, మాజీ మేయర్లు యాదగిరి సునీల్‌రావు, డి.శంకర్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, కోమల ఆంజనేయులు, వాసాల రమేశ్, రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ విద్యానగర్‌లో అప్పుల బాధతో దాసరి కృష్ణవేణుకుమార్(38) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. కరీంనగర్‌రూరల్ మండలం చెర్లబూత్కూర్ గ్రామానికి చెందిన కృష్ణవేణుకుమార్ విద్యానగర్‌లో నివాసం ఉంటూ స్థానిక ప్రైవేటు ఫైనాన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కృష్ణ వేణుకుమార్ కొందరికి మధ్యవర్తిగా ఉంటూ అప్పులు ఇప్పించాడు. తీసుకున్నవారు డబ్బులు చెల్లించక పోవడంతో మధ్యవర్తిగా ఉన్నందుకు ఒత్తిడి తీసుకురావడంతో కృష్ణవేణుకుమార్ మరోచోట అప్పుచేసి చెల్లించాడు. అప్పుతీసుకున్న వ్యక్తుల కారణంగానే తనభర్తఆత్మహత్య చేసుకున్నాడని కృష్ణవేణుకుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి చేసిన వారి పై కేసు నమోదు

వీణవంక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డేపల్లి అజయ్‌పై గురువారం అదే గ్రామానికి చెందిన అంబాల మోహన్, అంబాల అరుణ్ ఇనుపరాడ్‌తో దాడి చేశారు. గమనించిన అజయ్ కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అజయ్‌తండ్రి సమ్మయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

వేములవాడలో ఘనంగా దసరా వేడుకలు

- అంబారీపై స్వామివారి ఊరేగింపు
- ఎడ్లబండ్ల ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్
- రాజన్న ఆలయంలో ఆయుధ పూజ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీనవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం పదకొండోరోజు రాజరాజేశ్వరీదేవి అమ్మవారు మహాలక్ష్మి(పాలవెల్లి) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులుపెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.


ఎడ్లబండిపై ర్యాలీగా వెళుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

అంబారీపై స్వామివారి ఊరేగింపు..

పదకొండో రోజున పార్వతి పరమేశ్వరులు, లక్ష్మీసమేత పద్మనాభస్వామి వారి ఉత్సవ మూర్తులను అంబారీపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సేవతో పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.

ఆయుధ పూజ..

రాజరాజేశ్వర స్వామి ఆలయంలోని శ్రీలక్ష్మీపద్మనాభ ఆలయ ప్రాంగణంలో ఆయధాలను ఒక్కచోట ఉంచి పూజలు అర్చకులు నిర్వహించారు. కార్యక్రమానికి ఈవో రమాదేవి హాజరయ్యారు.

ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ర్యాలీ..

దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎడ్లబండ్ల ర్యాలీలో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. తన నివాసం నుంచి ఎడ్లబండ్లపై మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్దగల జమ్మివరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జమ్మిచెట్టువద్ద పూజలు నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఏనుగు మనోహర్ రెడ్డి, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్ గురువారం ఎడ్లబండ్ల ర్యాలీని నిర్వహించారు.


అంబారీపై ఊరేగుతున్న స్వామివారలు

భీమేశ్వర ఆలయంలో కోడెమొక్కు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన..

రాజన్న ఆలయంలో చేపడుతున్న ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భక్తుల దర్శనాలను శ్రీభీమేశ్వర ఆలయంలోకి మారుస్తున్న విషయం తెలిసిందే. అయితే దసరాను పురస్కరించుకుని గురువారం భీమేశ్వర ఆలయ ముందుభాగంలో కోడెమొక్కులు చెల్లించుకునేందుకు ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ఉమ్మడి జిల్లా సమావేశం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ ఉమ్మడిజిల్లాస్థాయి ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకిదయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సిరిసిల్ల కాంగ్రెస్‌ఇన్‌చార్జి కేకేమహేందర్‌రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల్లో పార్టీ వ్యవహరించాల్సిన తీరు, అభ్యర్థుల ఎంపిక, విజయానికి తీసుకోవాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. ఒక్కో మండలం నుంచి జడ్పీటీసీ అభ్యర్థుల కోసం 3 పేర్లను ఎంపిక చేసినట్లు సమాచారం.


సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

మూడు కార్లను ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు

మానకొండూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఈదులగట్టిపల్లి గ్రామ శివారులో ఓ లారీ మూడు కార్లను ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న లారీ మండలంలోని ఈదులగట్టిపల్లి గ్రామశివారులో ముందుగా వెళుతున్న కారును ఢీకొంది. ఆ కారు తన ముందు ఉన్న మరో కారును ఢీకొని వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వెళ్లుతున్న మూడో కారును ఢీకొంది. దీంతో కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. మొదట లారీ గుద్దిన కారులో ప్రయాణిస్తున్న వరంగల్‌కు చెందిన తండ్రి కొడుకులు సత్యనారాయణ, రాకేష్‌కు గాయాలు అయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం తెలుసుకున్న సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు జిల్లా కరాటే క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన జిల్లా కరాటే క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, బుద్ధి ధర్మ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అటెంప్ట్‌కు జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ గోజిరాయి కరాటే అకాడమీ క్రీడాకారులు ఎంపిక య్యారు. ఈనెల 5న చెన్నై స్టేడియంలో జరగనున్న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, 6న జరగనున్న బుద్ధి ధర్మ గిన్నిస్‌బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అటెంప్ట్‌కు కరాటే క్రీడాకారులు అన్వర్‌ఖాన్, అర్మాన్‌ఖాన్, ఫర్హాన్‌ఖాన్ ఎంపికైనట్లు కరాటే అకాడమీ గ్రాండ్‌మాస్టర్ అక్బర్‌ఖాన్ తెలిపారు. లండన్ నుంచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, అమెరికా నుంచి బుద్ధి ధర్మ రికార్డ్ నిర్వాహకులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను కరాటే మాస్టర్లు చరణ్, పి.జయేందర్, దర్శిత్ సంజీవన్‌సింగ్, ఫహమిద ఖాతూన్, సమీనా జవేరియా, అయుబ్ ఖాన్, ఆహ్వానులా అఖిల్ అభినందించారు.

పొంచి ఉన్న 'ప్రమాదం'..

- రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు
- భయాందోళనలో ప్రజలు


మల్యాలలో రోడ్డును అనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

చందుర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంతో పాటు మల్యాల, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకపోవడంతో ప్రమదకరంగా మారాయి. మల్యాల గ్రామ శివారులోని మూలమలుపు వద్ద రోడ్డును అనుకుని ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ లేకుండానే ఉండడంతో ఏ మాత్రం ఏమరుమాటుగా ఉన్నా ప్రమాదం తప్పదు. కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోనే ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పశువులు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం కారణంగా నిత్యం ఏదో ఒక సమస్య తలెత్తుతున్న తీరుతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జనసంచారం కలిగిన ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకోవడంతో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను సురక్షిత ప్రదేశానికి తరలించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలి..

లోకోజు సతీష్, మల్యాల



మల్యాల గ్రామ శివారులోని వేములవాడ నుంచి కోరుట్ల వెళ్లే ప్రధాన రహదారిలో పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఆ దారిలో వెళ్లే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉన్నది. ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు, పశువులకు సైతం ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇక్కడి నుంచి తొలగించి సురక్షిత ప్రాంతానికి తరలించాలి.


మల్యాలలో రోడ్డు పక్కన మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్

అంబరాన్నంటిన దసరా సంబరాలు


ఎల్లారెడ్డిపేటలో దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు


చందుర్తిలో అశ్వవాహనంపై ఊరేగుతున్న సీతారాములస్వామి


రుద్రంగిలో దసరా వేడుకల్లో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : విజయ దశమి వేడుకలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో గురువారం ఘనంగా జరిగాయి. పోలీస్ స్టేషన్‌లలో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది ఆయుధ పూజ జరిపించారు. గ్రామాల్లో వాహన పూజలు చేసేందుకు ఆలయాల వద్ద వాహనదారులు బారులు తీరారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం శమిపూజలు నిర్వహించారు. దేవతామూర్తులను రథంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. రావణ దహనం చేశారు. పలు గ్రామాల్లో ఎస్‌ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రజలకు తహసీల్దార్లు సుజాత, ముక్తర్‌పాషా, ఎంపీడీవోలు సత్తయ్య, బీరయ్య, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐలు రాహుల్‌రెడ్డి, లక్ష్మణ్, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, ప్యాక్స్ చైర్మన్లు కృష్ణారెడ్డి, సుధీర్‌రావు, మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

● సిరిసిల్ల టౌన్ : విజయదశమి సందర్భంగా జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆర్చరీ పరికరాల(విల్లు, బాణాలు)కు విద్యార్థులు ఆయుధ పూజను నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్, శ్రీనివాస్, ఆర్చరీ కోచ్‌లు హరీష్, మహేందర్, తదిత రులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం దసరా వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చందుర్తిలో శరన్నవ రాత్రులు సందర్భంగా అశ్వ వాహనంపై శ్రీ సీతారామచంద్ర స్వామివారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు శమీ పూజను ఘనంగా నిర్వహించారు. జమ్మి కొమ్మకు పూజలు నిర్వహించి, అనంతరం ఒకరికి ఒకరు జంబి పంచుకొని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఎదుట వాహనాలకు పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి చెట్టు వద్దకు వెళ్లి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. గ్రామాల్లో గురువారం సారుగమ్మ, గడి మైసమ్మలకు పూజలు నిర్వహించారు. గ్రామ కూడళ్లలో మేకలను బలి ఇచ్చారు. అనంతరం గ్రామాల సమీపంలోని జమ్మిచెట్ల వద్దకు డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాల మధ్య వెళ్లారు. జమ్మి ఆకుల కోసం యువకులు పోటీపడ్డారు. అనంతరం జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు పంచుకుంటూ అభినందనలు తెలుపుకున్నారు. ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టారు.

● తంగళ్లపల్లి : విజయదశమి పురస్కరించుకుని మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహ దేవాలయం గుట్ట వద్ద గురువారం ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిషాసూర దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఉపేంద్ర చారి, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడ్మాల శ్రీధర్‌రెడ్డి, రంగు అంజయ్య, సామల గణేశ్, ముక్క శ్రీనివాస్, జూకంటి శంకర్, ఏర శ్రీనివాస్‌రెడ్డి, సుద్దాల శ్రీనివాస్, చుక్క శేఖర్, చెన్నమనేని ప్రశాంత్ పాల్గొన్నారు.

రూ. 10వేలు పలికిన అమ్మవారి చీర

పద్మనగర్‌లోని రాజరాజేశ్వరి మండపం అమ్మవారి చీరను వేలం


తంగళ్లపల్లిలో మహిషాసుర దహనం..

వేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్ రూ.10వేలకు చీరను దక్కించుకున్నాడు.

● గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో దసరా పండగ పర్వదిన ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దసరా అంటే చెడుపై మంచి సాదించిన విజయానికి ప్రతీకగా మహిషాసురుడిని వధించి లోకాన్ని రక్షించిన దుర్గాదేవిని, రావణుడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టిన శ్రీ రాముడిని స్మరించుకునే పర్వదినంగా ప్రజలు పండగ జరుపుకుంటారు. దశమి రోజున శమీవృక్షాన్ని పూజించడం కొత్త పనులు ప్రారంబించడం శుభప్రదంగా ప్రజలు బావిస్తారు. దసరా పండగ నేపథ్యంలో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కోనరావుపేట : మండలంలో విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో విజయదశమి ఉత్సవంలో భాగంగా పాలపిట్టను పెద్దలు చూసి గ్రామదేవతలకు పూజలు నిర్వహించి డప్పు చప్పుల మధ్య ఊరేగింపుగా గ్రామస్థులు ఆటపాట్లతో జంబిచెట్టు వద్దకు వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి ఒకరినొకరు జంబి ఆకు పంచుతూ అలింగం చేసుకున్నారు. అన్ని గ్రామాల్లో విజయదశమి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామస్థులు పలు ఆలయాల వద్ద వాహన పూజలతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి అశ్వవాహనంపై జమ్మిచెట్టు వరకు భాజాభజంత్రీల మధ్య శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం జమ్మిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి ఆయుధ పూజను నిర్వహించారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మండల కేంద్రంలో జరిగిన దసరా వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దసరా వేడకల్లో పాల్గొని గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మంచె రాజేశం, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, కోమిరె శంకర్, సామ మోహన్‌రెడ్డి, నంద్యాడపు వెంకటేష్, మాడిశెట్టి అబిలాష్, సూర యాదయ్య, పల్లి గంగాధర్, బండారి నర్సయ్య, ఇప్ప మహేష్, ఎర్రం అరవింద్, పోగుల మహేష్, ఆకుల గగన్, చెలుకల శ్రీకాంత్, కాట్యూరి దాసు, దయ్యాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తారుమారైన ఆశలు..

(5వ పేజీ తరువాయి)

కేటాయించగా రెండు మహిళలకు, మూడు జనరల్, మూడు జనరల్ ఉండగా ఒకటి మహిళలకు, రెండు జనరల్ స్థానాలుగా ఉన్నాయి. జిల్లా గ్రామీణ ఓటర్లు 3లక్షల 53వేల 351మంది ఉన్నారు. ఇందులో పురుషులు 170772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు.

పట్టు కోల్పోకుండా...

గ్రామాల్లో పట్టు కోల్పోకుండా రిజర్వేషన్లు కలిసి రాకపోయినా తమ అనుచరులను రంగంలోకి దింపే ప్రయత్నం చేస్తున్నారు. రిజర్వేషన్ల మార్పులతో జిల్లాలో అనూహ్యంగా కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. రిజర్వేషన్ల తారుమారైనా కోల్పోయిన స్థానంలో తమకు సంబంధించిన వారిని గెలిపించుకొని తమ ప్రాబల్యాన్ని చాటుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో కొత్తవారికి అవకాశాలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు అభ్యర్థులను ఎంపికచేసే దిశగా కార్యచరణను మొదలుపెట్టారు. దీంతో ఆశావహులు పార్టీల మద్దతు కోసం పెద్దల చుట్టూ తిరుగుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి..
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

సిరిసిల్ల, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని, ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డు అందజేసి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణా భవన్‌లో చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దీనిని ఎన్నికల్లో చూపించేలా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. రేవంత్ ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వలేకపోయిందని విమర్శించిరు. రైతులు, మహిళా రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడుతున్నారని, కొన్నిచోట్ల చెప్పులు కూడా క్యూలో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హామీలు నెరవేర్చలేక నిందలు..

ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నిందలు వేస్తూ రేవంత్ సర్కారు కాలం వెళ్లబుచ్చుతోందని, రేవంత్ సర్కారు డైవర్షన్ పాలిటిక్స్‌తో రాష్ట్రంలో పరిపాలన కుంటుపడిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు గొప్పగా అమలు చేసిన కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తెచ్చేలా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా 420 హామీలను, ఆరు గ్యారెంటీలను అమలుచేయలేకపోయిందని విమర్శించారు. యూరియా కోసం రైతన్నలు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు పెంచుతామన్న హామీని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇప్పటికీ డ్రామాలాడుతోందని ధ్వజమెత్తారు. ఈ విష యాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ జడ్పీటీసీ లచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ మాదవ్, డాక్టర్ అమిత్‌కుమార్, అను ముల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



సులభ్ కాంప్లెక్స్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉచిత మూత్రశాల సౌకర్యం ఉన్నా నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సులభ్ కాంప్లెక్స్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం వెనకాల లేబర్‌అడ్డా ప్రాంతంలో ఉన్న సులబ్ కాంప్లెక్స్‌కు ఉచిత మూత్రశాల అనే బోర్డు ఉన్నా ఉచితం కనబడకుండా నిర్వాహకులు కాగితం అంటించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్‌లో ఉచిత మూత్రశాలను కొనసాగించాలని, డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, కోశాధికారి చిప్ప దేవదాస్, నాయకులు వేముల పోశెట్టి, కార్మికులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా దుర్గామాత శోభాయాత్ర


ఎల్లారెడ్డిపేటలో దుర్గామాత శోభాయాత్ర


కోలాటాలు ఆడుతున్న యువతులు, మహిళలు


ఇల్లంతకుంటలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గాదేవి విగ్రహం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ సన్నిధుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారు రాజరాజేశ్వర దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవిలు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనం ఇచ్చాయి. మండలకేంద్రంలో హిందువాహిణీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో ఉదయం మాజీ సర్పంచ్ ఒగ్గు నర్సయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో భక్తుల ద్వారా లక్కీడీప్‌ను నిర్వహించగా మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్ విజేతకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో హిందువాహిణీ అధ్యక్షుడు నాగసముద్రాల బాలకృష్ణ, నాయకులు మామిడి సంజీవ్, చిట్టి ప్రదీప్‌రెడ్డి, ఎర్రోజు సంతోష్, మ్యాకల మల్లేశం, శ్రీనివాస్, రామకృష్ణ, కొండ్ల వెంకట్‌రెడ్డి, హరికుమార్, సాదుల రాకేష్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంతో పాటు రామన్నపేట తదితర గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలను శుక్రవారం నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత విగ్రహం వద్ద ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం డప్పు చప్పులతో శోభయాత్ర నిర్వహించి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ యూత్ సభ్యులు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గామాతల నిమజ్జనం ఘనంగా జరిగింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గమాత తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న దుర్గమాతను డప్పుసప్పుల మధ్య ట్రాక్టర్ల ద్వారా ఊరేగించి అమ్మవారిని ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గంభీరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని డప్పు చప్పుళ్ళతో, భక్తి పాటలతో నృతాలతో గ్రామాల పురవీదుల వెంట నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. దుర్గమాత నమజ్జనోత్సవం సందర్బంగా దారి వెంట భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.


చందుర్తిలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత


నాగారంలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ సేవలను కొనియాడారు. ఆ మహనీయుడి బాటలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల క్రైం : మహాత్మగాంధిజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఎస్పీ మహేష్ బి. గీతే అన్నారు. గురువారం జాతిపిత మహాత్మాగాంధిజీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మహాత్మాగాంధి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : జిల్లాలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జాతిపిత మహాత్మ గాంధీ జయంతి వేడుకలు జరగాయి. సిరిసిల్ల పట్టణం గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీలు వేరు వేరుగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకులు చాంద్‌పాషా, ఎండీ సత్తార్, కొండ శ్రీనివాస్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సిరిసిల్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్తు, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు వేడుకలను జరిపారు. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో వాసవి క్లబ్ నేతృత్వంలో గాంధీజీ చిత్రప టానికి పూలమాలలు వేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌లు సబేరాబేగం, రాములు నాయక్, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, సుభాష్, సీత్యానాయక్, రాజయ్య, మురళీ, భాస్కర్, నాగేంద్రం, బాబు, గిరిధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కిషన్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, బుచ్చాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమణయ్య, రాజేశం, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్ తదితర గ్రామాల్లో గురువారం గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్, వైశ్యసంఘ నాయకులు ఉప్పల అమర్, దొంతుల శంకర్, బోనగిరి రాము, నార్ల రాంకిషన్, నార్ల దినేష్, సిరికొండ ఆంజనేయులు, మురళి, ఈదుల రవీందర్‌రెడ్డి, బోనగిరి కిషన్, దినేష్, మల్లేశం, హరికృష్ణారెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.


ఇల్లంతకుంటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

● తంగళ్లపల్లి : మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయంత్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ దినేష్, సిబ్బంది నర్సయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ అధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోర లక్ష్మీరాజం, నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, సుద్దాల కరుణాకర్, ప్రశాంత్, పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా చందనగిరి గోపాల్ గొట్టే రుక్మిణి ప్రజాప్రతినిధులు జగిడి బాపురెడ్డి వెంగలి వెంకన్న సిద్ధం శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.